క్లుప్తంగా

సమాచార హక్కు చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు రాజేశ్వరరావు

బొబ్బిలి: సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా స్థానిక సాయి డిగ్రీ కళాశాలలో సమాచారం హక్కు చట్టంపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. తహసీల్దారు డోల రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ, అధికారుల పాలనలో పారదర్శకతకు తీసుకువచ్చిన సమాచార హక్కు చట్టాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశంలోని ఏ పౌరుడైనా దీన్ని ఉపయోగించుకుని, ఏ శాఖ సమాచారం కావాలన్నా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దారు బలివాడ గౌరీశంకర్, కళాశాల కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు, ప్రిన్సిపాల్ రెడ్డి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల రికార్డుల పరిశీలన



పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవోలు ప్రవీణ్‌కుమార్, దుర్గారావు

రాజాం: మండలంలోని ముద్దాడజోగివలస గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఎంఈవోలు పి.ప్రవీణ్‌కుమార్, వై.దుర్గారావు మంగళవారం సందర్శించి, అక్కడి విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం కింద అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం వంటకాలు వండిపెట్టాలని, ఆహార పదార్థాలు రుచి, శుచి కలిగి ఉండాలన్నారు. అంతకుముందు పాఠశాల రికార్డులు, టీచర్స్ డైరీ, ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2 గ్రేడింగ్ రిజిస్టర్లు పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, చదువులో వెనకబడిన ప్రతీ విద్యార్థి విద్యాప్రగతిపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.ఆర్.కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు ప్రణాళికలు

రేగిడి: అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు పక్కాగా చేయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఏపీవో హరనాథరావు తెలిపారు. మంగళవారం స్థానిక మండల ఉపాధి కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించనున్న ఉపాధి హామీ పనులపై చర్చించేందుకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామసభల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు, వేతనదారులు పాల్గొనాలని కోరారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ప్రజలందరికీ వైద్యసేవలు

తెర్లాం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ఓపీ ఎందుకు తక్కువగా నమోదు అవుతుందో తెలియజేయాలని వారిని ప్రశ్నించారు. ఇంటింటి సర్వే సమయంలో వందల సంఖ్యలో వైద్య సేవలు అవసరమని పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ఎందుకు హాజరుకావడం లేదన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని, అధిక సంఖ్యలో ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు హాజరయ్యేలా చూడాలన్నారు.

మహిళా సంఘాల సంఖ్య పెంచాలి

రేగిడి: మహిళా సంఘాల సంఖ్యను పెంచాలని వైకేపీ ఏసీ ఎ.చిరంజీవి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీసీలు, సీఎఫ్‌లు, వీవోఏలతో సమావేశమైన ఆయన సంఘాల ఆర్థిక బలోపేతానికి, మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన రుణాల లక్ష్యాలు అధిగమించాలని తెలిపారు. అనంతరం స్త్రీనిధి, ఎస్‌పీఈపీ, పీఎంఈజీపీ తదితర రుణాల మంజూరుపై సమీక్షించారు. కార్యక్రమంలో ఏపీఎం టి.మంగమ్మ పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి

రాజాం సిటీ: మండల పరిధిలోని ఓ గ్రామానికి గ్రామానికి చెందిన ఓ బాలికపై ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.రవికుమార్ మంగళవారం తెలిపారు. ఈ నెల 9వ తేదీన ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఇంటి వద్దనే పడుకున్న బాలికపై ఎవరూ లేని సమయం చూసి, ఆ వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే బాలికతో పాటు ఆమె తల్లి, చెల్లిని కూడా చంపుతానని బెదిరించాడు. దీంతో ఎవరికీ చెప్పకుండా ఇంట్లోనే మౌనంగా ఉండిపోయింది. మంగళవారం తీవ్రమైన కడుపునొప్పితో పాటు ఒంటి నొప్పులతో బాధపడుతున్న బాలికను చూసి, తల్లి ఏం జరిగిందని అడగ్గా, విషయం తెలియజేసింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజల ఆరోగ్యానికి భరోసా!

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి భరోసానిస్తోంది. గ్రామగ్రామాన నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. మంగళవారం జరిగిన కార్యక్రమంలో రోగులకు ఆరోగ్య తనిఖీలు చేయడంతో పాటు, అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్య భద్రతకు ప్రాధాన్యమిస్తున్నారని, 45 రోజుల పాటు అందుబాటులో ఉండే ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు కోరారు.

–సాక్షి నెట్‌వర్క్



రామభద్రపురం: నాయుడువలసలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రోగికి ఈసీజీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది



రామభద్రపురం: నాయుడువలసలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మెంటాడ: ఆగూరులో జగన్న ఆరోగ్య సురక్ష బ్యాగులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



బొబ్బిలి: రంగరాయపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వద్ద ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్



వంగర: కింజంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ప్రజాప్రతినిధులు, వైద్యారోగ్య సిబ్బంది



తెర్లాం: పూనువలసలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వద్ద ఐసీడీఎస్ పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దారు రత్నకుమార్, సర్పంచ్ రమణమూర్తి



రామభద్రపురం: నాయుడువలసలోని వైద్య శిబిరాన్ని సందర్శించిన జగనన్న ఆరోగ్య సురక్ష జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రవికుమార్



బాడంగి: వీరసాగరంలో రోగులకు మందులు, జగనన్న ఆరోగ్య సురక్ష బ్యాగులు అందజేస్తున్న దృశ్యం



రాజాం: పెనుబాకలో వైద్యశిబిరంలో జగనన్న ఆరోగ్య సురక్ష బ్యాగులతో జెడ్పీటీసీ నర్సింహులు, డాక్టర్ రాజేష్



సంతకవిటి: మిర్తివలసలో రోగి బీపీ తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది



రేగిడి: ఖండ్యాంలో రోగులకు మెడికల్ కిట్లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ జగన్మోహనరావు

ఘనంగా గ్రామదేవత ఉత్సవాలు



అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో గ్రామదేవత ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు గ్రామదేవత అసిరితల్లికి ముర్రాటలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ ఎర్నేన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో మహిళలకు రక్షణ



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

వంగర: అత్యవసర సమయాల్లో దిశ యాప్ ఉపయోగిస్తే మహిళలకు రక్షణ కలుగుతుందని రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన రికార్డులు నిర్వహణ, పెండింగ్ కేసులు, ఫిర్యాదులు వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దిశ యాప్‌పై గ్రామాల్లో, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. మద్యం, సారా విక్రయాలు జరిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఆర్.జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోలేరు..

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశంతో పార్టీ నాయకుల్లో మరింత ఉత్సాహం
- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: టీడీపీ, దాని తోక పార్టీలు ఎన్ని వచ్చినా అలజడులు సృష్టించినా, రాద్ధాంతాలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోలేరని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ధీమా వ్యక్తంచేశారు. మండలంలోని నాయుడువలసలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన ఈ నెల 9వ తేదీన విజయవాడలో నిర్వహించిన ప్రజాప్రతినిధుల సదస్సులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన దిశానిర్దేశంతో పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం కనబడిందన్నారు. రాష్ట్రంలోని పేదప్రజలు సంతోషంగా ఉండాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డే రావాలన్నారు.

నవంబరు 1వ తేదీ నుంచి నిర్వహించనున్న వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లి, వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలకు జరిగిన మేలును వివరిస్తామన్నారు. గ్రామాల్లో అత్యధిక శాతం మందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ వల్ల మేలు జరుగుతుందంటేనే మళ్లీ వైఎస్సార్ సీపీ ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరుతామన్నారు. టీడీపీ నేతల అధిక వాగుడు, కుతంత్రాలు ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ అడ్రస్ గల్లంతవడం ఖాయమన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీదే విజయమన్నారు. తన సూచనలతో పాటు మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్టీ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ఆదేశాలతో పారాది వంతెన మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రెండు, మూడు రోజుల్లో ప్రజల ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా వంతెన మీదుగా వాహనాల రాకపోకలు కొనసాగుతాయన్నారు. భారీ వాహనాలు మినహా బస్సులు, నాలుగు చక్రాల వాహనాల రాకపోకలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వమని అధికారులకు తెలిపామన్నారు. కార్యక్రమంలో నాయుడువలస సర్పంచ్ నడిమింటి లక్ష్మి, నేతలు లెంక శ్రీనివాసరావు, తాత్రాసు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో మంగళవారం ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యుడు ఎస్.సునీల్‌కుమార్ శిబిరానికి వచ్చిన పలువురికి తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. చాలా మంది రోగులు కీళ్లనొప్పులు, వాతనొప్పులు, రక్తపోటు, మధుమేహం, చర్మవ్యాధులతో బాధపడుతున్నట్లు తన దష్టికి వచ్చిందని వైద్యుడు తెలిపారు.



ఉప్పర్నాయుడువలసలో ఆయుర్వేద వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

వాహన తనిఖీలు

సంతకవిటి: మండలంలోని పొనుగుటివలస జంక్షన్, గుళ్లసీతారాంపురం, సంతకవిటి తదితర ప్రాంతాల్లో పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు సిబ్బందితో కలిసి, అటువైపుగా వచ్చే వాహనాల్లో తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టడమే లక్ష్యంగా తనిఖీలు చేసినట్లు సిబ్బంది తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్‌ఐ కోరారు.



కారులో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు

ప్రతిఇంటా 'సంక్షేమ' సంతోషం



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేసి, ప్రభుత్వ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ సంతోషం నెలకొందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని గొంగాడవలస, రెడ్డియ్యవలస గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ ఆయన అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనదేనన్నారు. గతంలో టీడీపీ పథకాల పేరిట ప్రజాధనాన్ని దోచుకుందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ హయాంలో అమలైన పథకాల్లో ఇంతవరకు ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే గెలిపించి, మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత శంబంగి వేణుగోపాలనాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు, ఈవోపీఆర్‌డీ అల్లు భాస్కరరావు, ఉప తహసీల్దార్ బలివాడ గౌరీశంకరరావు, గొంగాడవలస సర్పంచ్ గొంగాడ రమణమూర్తి, చింతాడ సర్పంచ్ బంకురు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్తసేకరణ బుట్టల పంపిణీ

తెర్లాం: మండలంలోని గ్రామాల్లో చెత్తసేకరణ బుట్టల పంపిణీ మంగళవారం చేపట్టారు. ప్రతీ ఇంటికి అందజేసిన రెండు బుట్టలలో ఒకదానిలో పొడిచెత్త, మరొకదానిలో తడిచెత్త వేసి, గ్రీన్‌అంబాసిడర్‌కు అందించాలని ఈవోపీఆర్‌డీ నీలిమ సూచించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

రేగిడి: విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు సూచించారు. మంగళవారం మండలంలోని వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, అక్కన్నఅగ్రహారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ఆయన ఆయా పాఠశాలల్లో విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. వన్నలి పాఠశాల నిర్వహణ బాగుండడంతో ఆ పాఠశాల హెచ్‌ఎం గౌరీశ్వరరావు, ఆ పాఠశాల సిబ్బందిని ఎంఈవో అభినందించారు.

మాదకద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట



రామభద్రపురం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీధర్

- డీఎస్పీ పి.శ్రీధర్

రామభద్రపురం: మాదకద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ పి.శ్రీధర్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సీఐ తిరుమలరావుతో కలిసి మంగళవారం సందర్శించిన ఆయన అక్కడి స్టేషన్ రికార్డులు, సిబ్బంది పనితీరు, పరిసరాలు పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రామభద్రపురం బైపాస్ రోడ్డు వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటుతో ఆంధ్రా బోర్డరులో ఉన్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి గంజాయి, ఖైనీ, గుట్కా వంటి మాదక ద్రవ్యాలు రవాణా కాకుండా చూశామన్నారు. మత్తు పదార్థాలు తీసుకుని, వాహనాలతో రోడ్లపైకి రావడం వల్ల, రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వలనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు తీసుకుని, జీవితం పాడు చేసుకోవద్దని సూచించారు. దాబాల్లో మద్యం, ఖైనీ, గుట్కా వంటి మాదక ద్రవ్యాలు విక్రయించినా, మద్యం సేవించేందుకు అనుమతించినా సంబంధిత యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాబాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, దాబాలకు వచ్చిన వ్యక్తులపై అనుమానాలు వచ్చినా వెంటనే స్థానిక ఎస్‌ఐకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ సురేంద్రనాయుడు ఉన్నారు.

'నాగటి'కి నివాళి

బొబ్బిలి: స్థానిక పట్టణంలో యూటీఎఫ్, ఎస్టీఎఫ్ఐ మాజీ నాయకుడు నాగటి నారాయణ ప్రథమ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్, జిల్లా కార్యదర్శి కేశవరావు, మండల నాయకులు సుధాకరరావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, రామకృష్ణ, కృష్ణదాసు తదితరులు కలిసి నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రేగిడి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ బొద్దాం సెక్టార్ సూపర్‌వైజర్ జి.సుజాత తెలిపారు. మంగళవారం మండలంలోని పెనుబాక గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార ప్రదర్శన చేపట్టి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ మనం తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేసే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులను కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జి.పుణ్యవతి, బి.భాగ్యలత, జి.లలిత తదితరులు పాల్గొన్నారు.



పెనుబాకలో పౌష్టికాహార ప్రదర్శన వద్ద అంగన్‌వాడీ సిబ్బంది

తూటికాడ కషాయంతో సుడిదోమ నివారణ



రాజాం: తూటికాడ కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం: తూటికాడ కషాయంతో సుడిదోమ నివారణ సాధ్యమని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రమాదేవి తెలిపారు. మంగళవారం మండలంలోని పొగిరి గ్రామంలో మహిళా రైతు సంఘాల సభ్యులతో పాటు పలువురు రైతులకు తూటికాడ కషాయం తయారీపై అవగాహన కల్పించారు. 15 లీటర్ల ఆవుమూత్రం, 10 కిలోల తూటికాడ ఆకులు మరగబెట్టాలని, దాని ద్వారా తయారైన కషాయాన్ని ఎకరం పొలంలోని పంటలో పిచికారీ చేయాలన్నారు. దీంతో పంటకు పట్టే సుడిదోమ, తెల్లదోమ నివారణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ వై.నిర్మల తదితరులు పాల్గొన్నారు.